ప్రజాశక్తి



పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు :పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ ఒ. ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్ ఆర్ శంకరన్ హాలులో పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదం సంభవిస్తే సంబంధిత రెవెన్యూ అధి కారులకు తెలియ జేయడం యాజమాన్యాల కనీస బాధ్యత అన్నారు. ఫ్యాక్టరీ, పరిశ్రమలు, కార్మిక, ఫైర్, బాయిలర్స్ శాఖల అధికారులతో కూడిన కమిటీ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖ జియం మారుతీ ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, ఫాక్టరీ ఇన్స్పెక్టర్ శైలేంద్ర కుమార్, బాయిలర్స్ ఇన్స్పెక్టర్ సుష్మ, అగ్నిమాపక శాఖ ప్రతినిధి షరీఫ్ ఉన్నారు.

విమానాశ్రయానికి 'అదాని' బ్రేకులు..!

- జగన్ ఉద్దేశపూర్వకంగానే నిలిపారా
- నెల్లూరుపై ఆయనకెందుకు కక్ష
- చంద్రబాబు ముందుకు తీసుకెళ్లేనా

ప్రముఖ వ్యాపారదిగ్గజం అదాని నెల్లూరు ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారు... ఆసియాలోనే అతిపెద్ద కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ తొలగించి 10 వేల మంది ఉద్యోగుల పొట్టగొట్టారు...పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చి నిరుద్యోగయువతకు ఉద్యోగాలొస్తాయని ఆశపడ్డారు... అది ముందుకు సాగడం లేదు..తాజాగా దగదర్తి విమానాశ్రయానికి అదాని బ్రేకులు వేశారని సమాచారం. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సన్నిహితుడు వైసిపికి చెందిన ఈ విషయాన్ని ఓ సభలో బయటపెట్టారు...2019లో శంకుస్థాపన చేసిన ఈ ఎయిర్‌పోర్టును ఉద్దేశపూర్వకంగానే మాజీ సిఎం పక్కనపెట్టారని తెలిసింది. ఓవైపు కృష్ణపట్నం పోర్టు, మరో వైపు ఎయిర్‌పోర్టును అదాని ఎందుకు దెబ్బతీస్తున్నారు.సిఎం చంద్రబాబునాయుడు ఆయనను కాదని దీనిని ముందుకు తీసుకెళతారా చూడాలి..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ప్రాంతం. సెజ్‌లు, థర్మల్ ప్రాజెక్టు, కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు, భారీ పరిశ్రమలు అడుగులు పడుతున్నాయి. 1996 నుంచి కృష్ణపట్నం పోర్టుపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2004 నుంచి ఇది వేగవంతమైంది. 42 బెర్త్‌లతో ఆసియాలోనే అతిపెద్ద పోర్టుగా అభివృద్ధి చెందుతోన్న సమయంలో 2022లో అదాని దీనిని దక్కించుకున్నారు. అదాని చేతికి వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని భావించారు. పోర్టుకు ప్రాణమైన కంటైనర్ టెర్మినల్‌ను తొలగించి 10 వేలమంది ఉద్యోగులు, కార్మికుల కడుపు కొట్టారు.. దీనిని మళ్లీ పునఃప్రారంభించాలని స్థానిక ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సిపిఎం, సిపిఐ, బిజెపి, జనసేన పార్టీలు పోరాటం చేస్తున్నాయి. ఇది వస్తుందో రాదో తెలియడం లేదు. పోర్టు దెబ్బతినడంతో అనేక పరిశ్రమలు వెనక్కి వెళుతున్నాయి. సజావుగా సాగుతోన్న నవయుగ కంపెనీ నుంచి అదాని దీనిని ఎందుకు తీసుకున్నారో తెలియదు కాని, జిల్లా ప్రజలు తీరని ద్రోహం చేస్తున్నట్లు కనిపి స్తోంది...

దగదర్తి విమానాశ్రయానికి 'అదాని' బ్రేకులు..!

నెల్లూరు విమానాశ్రయం జిల్లా ప్రజల చిరకాల కల. ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు వ్యాపారం, చదువులు, ఉద్యోగాల కోసం వేలాది మంది వెళుతుంటారు. చెన్నయ్, రేణిగుంట, విజయవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లల్సి వస్తుంది. అందుకే నెల్లూరులో విమానాశ్రయం కోసం అనేక ప్రాంతాలు చూశారు. చివరకి 2017లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు దగదర్తి మండలం, దామవరం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టును స్థల సేకరణ చేశారు. రైతుల నుంచి1352 ఎకరాలు తీసుకున్నారు. 2019 జూన్‌లో ఎన్నికల సమయంలో. నెల్లూరు ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రయివేట్ లిమిటెడ్ (ఎన్ఐఎఎల్)కు చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు ఈ విమాశ్రయం వల్ల మూడు బిలియన్లు పెట్టుబడులు, ప్రతేడాది 20 లక్షల మంది ప్రయాణికులు, 55 వేల మెట్రిక్ టన్నుల కార్గో సరఫరా అవుతుందని ప్రకటించారు. 14 నెల్లో పూర్తి చేస్తామని ఆ నాడు సభలో తెలిపారు. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి పోర్టు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇందుకు ఏవో కారణాలు చెప్పుకుంటు వచ్చారు. తాజాగా దగదర్తి పోర్టు ఎర్పాటు విషయంలో ముందుకు వెళ్లవద్దని, అది అవసరం లేదని స్వయంగా అదాని జగన్‌తో చెప్పినట్లు తెలియవచ్చింది. తాజాగా వైసిపికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఈ విషయం బయటపెట్టారు. దగదర్తి పోర్టు గురించి ఆయన అడిగినప్పుడు "నేను ఏం చేయను. అదానికి అక్కడ పోర్టు అవసరం లేదని చెబుతున్నారు. ఎందుకో తెలియదు..దానిని చేయలేం " అంటూ చెప్పినట్లు బయటపెట్టారు. ఇందులో అదాని రాజకీయం అర్థంకావడం లేదు. అందుకే జగన్ రామాయపట్నం పోర్టు అంటూ కొత్త పాట పాడారు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి అదాని అడ్డుపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

2019లో దగదర్తిలో ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా చంద్రబాబునాయుడు వేసిన శిలాఫలకం(ఫైల్)

'చంద్రబాబు' కొనసాగించేనా..!

దగదర్తి విమానాశ్రయాన్ని అదాని ఉద్దేశపూర్వకంగానే నిలిపించారని తెలిసింది. ఈ సమయంలో దీనిని ముఖ్యమంత్రి కొనసాగిస్తారా అంటే అనుమానమే. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ తొలగించారు, దానిని పునఃనిర్మించాలని టిడిపి నేతలతోపాటు, అఖిలపక్షాలు ఆందోళనలు చేస్తున్నా ఒక్క అడుగు ముందుకుపడడం లేదు. ఇలాంటి సమయంలో బిజెపికి అత్యంత సన్నిహితులైన అదానిని కాదని చంద్రబాబు ఎం చేస్తారో చూడాలి. ఒకప్పుడు అభివృద్ధిలో పరుగులు పెట్టిన జిల్లా ఇప్పుడు నత్తనడక నడుస్తుంది. రాజకీయనేతలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు మేల్కొనకపోతే జిల్లా పరిస్థితి అదోగతే..

ఉచిత వైద్యం పొందిన వారితో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

15 మందికి ఉచితంగా ఆపరేషన్లు

ప్రజాశక్తి-నెల్లూరు :నెల్లూరు రూరల్ నియోజకవర్గం గొల్లకందుకూరు, సజ్జాపురం గ్రామంలో జరిగిన నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమంలో సజ్జాపురం గ్రామానికి చెందిన 15 మందికి మెడికవర్ హాస్పిటల్ లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, హాస్పిటల్ సహకారంతో ఉచితంగా వైద్యం చేయించుకున్న వారిని టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరామర్శించారు ఇద్దరికి గర్భసంచి ఆపరేషన్‌లు, ఇద్దరు పిల్లలకు వినికిడి ఆపరేషన్‌లు, పిల్లవానికి ముక్కు ఆపరేషన్, మోకాలు ఆపరేషన్, గుండె సంబంధిత ఆపరేషన్ నిర్వహించారు. లోకేష్ ఆరోగ్య రక్ష పథకంలో ఉచితంగా రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం చేయించి, క్షేమంగా ఇంటికి చేరుస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నీ తానై హాస్పిటల్ లో దగ్గరుండి చూస్తున్న నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నారా లోకేష్ ఆరోగ్య రక్ష ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేటర్లు శ్రీని వాసులురెడ్డి, మూలే విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

'మాజీ మంత్రి' కాకాణి హౌస్ అరెస్ట్

ఇంటివద్ద ఉద్రిక్తత - వైసిపి శ్రేణులు నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని మంగళవారం నెల్లూరునగరంలోని డైకాస్‌రోడ్డులోని తన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న వైసిపి శ్రేణులు అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆయన కుమారుడు కనుపూరు కాలువకు సంబంధి ంచిన కాంట్రాక్టు పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, రైతులతో కలిసి నేరుగా అక్కడకు వెళ్లడానికి ప్రయత్నం చేశారు. ఉదయమే కనుపూరు కాలువ వద్ద టిడిపి, వైసిపి నాయకులు వచ్చారు. నెల్లూరు నగరంలోని డైకాస్‌రోడ్డులోని కాకాణి నివాసం నుంచి తన అనుచరులతో బయలుదేరడానికి సిద్ధమయ్యారు. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన నివాసాన్ని చుట్టుముట్టారు. కార్యక్రమానికి అనుమతి లేకుండా వెళ్లడానికి వీల్లేదని చెప్పారు. తాను వెళ్లితీరుతానని చెప్పడంతో వెంకటాచలం, నెల్లూరు 5 టౌన్ సిఐలు సుబ్బారావు, కిశోర్‌కుమార్ అడ్డుకున్నారు. అయన అక్కడే ఉండిపోయారు. విషయం తెలుసుకున్న వైసిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాకాణి నివాసానికి చేరుకున్నారు. పోలీసులు, టిడిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షనేతలకు స్వేచ్ఛలేదని విమర్శించారు. మళ్లీ పోలీసుల అనుమతి తీసుకొని కనుపూరు కాలువ సందర్శించి జరిగిన అవినీతి బయట పెడతానని హెచ్చరించారు. ఈనెల 11 వరకు కాంట్రాక్టర్లు అవకాశం ఉండగా అప్పుడే ఎంఎల్ఎ, ఆయన కుమారుడు పనులు చేశారన్నారు. ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి మాజీ మంత్రి కాకాణిని కలిసి సంఘీభావం తెలిపారు. నెల్లూరు, సర్వేపల్లి, పొదలకూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఆపార్టీ నేతలు నిరసన తెలిపారు. మధ్యాహ్నం వరకు పోలీసులు ఆయనను గృహనిర్బంధంలోనే ఉంచారు.

కాకాణి గోవర్ధన్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

సభ్యత్వ నమోదుపై దృష్టి

రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండాలి - మంత్రి 'ఆనం'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఆత్మకూరు నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు పార్టీనేతలందరూ ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై మండల కన్వీనర్లు, నాయకులు, బూత్‌లెవల్ ఏజెంట్లకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల పార్టీ నేతలు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాల న్నారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి రాష్ట్రంలో 10 నియోజకవర్గాలను మోడల్ నియోజకవర్గాలుగా పార్టీ ఎంపిక చేసిందన్నారు. ఇప్పటివరకు కళ్యాణదుర్గం మొదటి స్థానం, ఆత్మకూరు రెండో స్థానంలో నిలిచాయని చెప్పారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఆత్మకూరు ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో ఆత్మకూరును మొదటి స్థానానికి చేరుకునేలా పార్టీ క్యాడర్ అంతా సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసు కోవాలన్నారు. నియోజకవర్గంలో 1.20 లక్షల మందిని సభ్యులుగా చేర్చేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రతి బూత్‌లో సుమారు 70 శాతం ఓటర్లను పార్టీ సభ్యులుగా నమోదు చేసి లక్ష్యాన్ని అధిగమించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తూ వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పింఛన్లు, అన్నా క్యాంటీన్లు, దీపం, రోడ్లు వంటి కార్యక్రమాలను ప్రభుత్వ నిర్వహిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బుల్లెట్ రమణ, కార్తీక్, నాయకులు బొల్లినేని గిరినాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి 'ఆనం'

30 సవర్లు బంగారం అపహరణ

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని పెద్దపవనిలో మంగళవారం తెల్లవారు జామున భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రామిశెట్టి మాలకొండయ్య ఇంట్లో దొంగలు పడి చోరీ చేశారు. మాలకొండయ్య ఇంటికి తాళం వేసి తన సొంత పనుల నిమిత్తం ఒంగోలు వెళ్లారు. ఎవరూ లేని సమయంలో తెల్లవారుజామున దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో చోరీ జరిగిందని, చుట్టుపక్కల వారు మాలకొండయ్య కు ఫోన్ చేసి చెప్పడంతో ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుభాని తన సిబ్బందితో వెళ్లి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో డబల్ కాట్ మంచంలో ఉన్న బంగారాన్ని తీసుకెళ్లారు. సుమారు 30 సవర్ల బంగారం పోయినట్లు మాలకొండయ్య తెలిపారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు.చోరీ జరిగిన ఇంటిని కందుకూరు డిఎస్‌పి బాలసుబ్రమణ్యం ,గుడ్లూరు సిఐ మంగారావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాని చెప్పారు.

భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - లింగసముద్రం :భూములు రీసర్వే జరిగినప్పుడు తలెత్తిన సమస్యలకు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ కే.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. లింగసముద్రం రెవెన్యూ పరిధిలో సమస్యలు ఉన్నవారు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ 44 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ చెప్పారు. అర్జీలను పరిశీలించి పరిష్కారం చూస్తామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్

ఆకట్టుకున్న కోలాటం

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండల పరిధిలోని బసిరెడ్డిపాలెంలో సోమవారం రాత్రి టిడిపి నాయకుల ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. గ్రామ టిడిపి నాయ కులు ,కార్యకర్తలు ,తెలుగు యువత ,మహిళలు ఆయనకు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో మహిళలు ప్రదర్శించిన కోలాటాన్ని తిలకించారు. టిడిపి గ్రామ కమిటీ నాయకులు ఎంఎల్ఎను సన్మానించారు. టిడిపి మండలాధ్యక్షులు జనిగర్ల నాగరాజు ,టిడిపి సీనియర్ నాయకులు మాలకొండా రెడ్డి ,కర్నాటి మల్లిఖార్జున రెడ్డి ,పాతపాటి సుబ్బారెడ్డి ,సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-ఉలవపాడు :మండలం వీరేపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమం లో భాగంగా మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారిని బి. తిరుమల జ్యోతి అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ అధికారి పిఎం కిసాన్ రైతుల సమస్యలను పరిశీలించారు. రైతులకు పథకాలు గురించి వివరించారు. ఉద్యాన శాఖ అధికారిణి బి.జ్యోతి పాల్గొని మాట్లాడారు.

సమస్యలపై చర్చ

నెల్లూరు :కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి ఈ సర్వసభ్య సమావేశం మంగళవారంమేయర్ స్రవంతిజయవర్ధన్ అధ్యక్షతన జరిగింది. తొలుత నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సూర్యతేజతో సభ్యులందరూ పరిచయం చేసుకున్నారు. అనంతరం మేయర్ సమావేశం ప్రారంభించేందుకు ముందుగా పరిపాలన సజావుగా సాగేందుకు నూతనంగా చట్టసభలకు ఎన్నికైన శాసనసభ్యులకు, పార్లమెంట్ సభ్యులు సహకరిస్తున్నారని, వారందరికి కృతజ్ఞతలు ఎంఎల్‌సి ఎంఎల్‌సి అయిన తన పేరును ప్రస్తావించకపోవడాన్ని ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి తప్పు పట్టారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థలో పనిచేసే ఉద్యోగులు,కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విధులు బహిష్కరించి కార్పొరేషన్ కార్యాలయం ఎదుటన్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నగరపాలక సంస్థ పాలకవర్గం సర్వసభ్య సమావేశం సందర్భంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టారు. నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు విధులు బహిష్కరించి బారాషహీద్ దర్గా గ్రౌండ్స్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కమిషనర్ వనచ్చి సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నింగా పోలీసులు కార్మికుల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త నెలకొంది. నగర డిఎస్‌పి శ్రీనివాసులు రెడ్డి జోక్యం చేసుకొని కొంతమంది కార్మిక సంఘ ప్రతినిధులు లోపలికి వెళ్లి కమిషనర్‌తో చర్చించాలని సూచించారు. ఆయన సూచన మేరకు లోపలికి వెళ్లిన కార్మిక సంఘ ప్రతినిధులు గంటకు పైగా వేచి చూడగా కమిషనర్ బయటకు రాలేదు. కమిషనర్ ధోరణిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ బయటకు వచ్చారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కే పెంచల నరసయ్య, సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, రూరల్ సిఐటియు నాయకులు కొండా ప్రసాద్ మాట్లాడారు. నగరపాలక సంస్థలో కార్మికులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొం టున్నారన్నారు.. నగర జనాభాకు అనుగుణంగా తక్షణమే కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అర్జీని నగర డిఎస్‌పి శ్రీనివాసులు రెడ్డి కు సమర్పించి ఉన్నతాధికారులకు సమస్యను వివరించాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ, కాయంబు శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి, కె.వి రమణారెడ్డి, రూరల్ కమిటీ సభ్యులు మాల కొండయ్య,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం అశోక్, ఆరం సునీల్ కుమార్, ఎం శ్రీనివాసులు, సుజాత, దేశ మూర్తి,లోకేష్,కామాక్షమ్మ, కొండమ్మ, భారతి, మనోజ్, జె కుమార్, బాలు, ముని మోహన్ బాబు,షబ్బీర్,మరియన్న,సురేంద్ర ఉన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు :11వ డివిజన్‌లో డివైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎన్‌టిఆర్ నగర్ సిపిఎం ఆఫీసు సెంటర్ పార్కు దగ్గర డివైఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు కర్తంబాబు రెడ్డి జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ముఖ్యఅతిథిగా డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బి.నరసింహ పాల్గొని మాట్లాడారు.

కిమ్స్ బొల్లినేని సెంటర్‌లో.. స్థానిక 36 డివిజన్ పరిధిలోని కిమ్స్ బొల్లినేని సెంటర్ లో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి చైతన్య మాట్లాడారు. మాజీ డివైఎఫ్ నాయకులు కొండ ప్రసాద్, మాలకొండయ్య పాల్గొన్నారు.

సుందరయ్యనగర్ బ్లాక్‌లో :

23వ డివిజన్ పరిధిలోని సుందరయ్యనగర్ ఏ బ్లాక్ సెంటర్‌లో డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ డివైఎఫ్ఐ మాజీ కార్యదర్శి ఒంగోలు మాట్లాడారు.రూరల్ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, రవిలు డివైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు.

సుందరయ్యనగర్ బ్లాక్‌లో..

డైకాస్‌రోడ్డు ప్రాంతంలో.. రూరల్ 32 డివిజన్ డై క్రాస్ రోడ్ లో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి చైతన్య మాట్లాడారు. మాజీ డివైఎఫ్ఐ నాయకులు కొండ ప్రసాద్ మరియు ఎస్.కె ఖలీల్ బాయ్, డివైఎఫ్ఐ కమిటీ సభ్యులు ఇక్బాల్, షబ్బీర్, కమురు, ఆఫీస్, అమర్ భాష, సమీర్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల్లో యంత్రాలు

ప్రజాశక్తి-కందుకూరు :మన్నేరులో పూడిక తీత పేరిట అధికార పార్టీ మరోచోట ఇసుక దందాకు తెరలేపింది. గుడ్లూరు మండలంలోని దప్పలంపాడు చెక్ డ్యామ్ వద్ద ఇసుక బాగోతం ముగిసి ముగియగానే సోమవారం ఉలవపాడు మండలంలోని కరేడు ఆనకట్ట వ్యవస్థ వద్ద ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. భీమవరం రెవెన్యూ గ్రామ పొలిమేరలో మన్నేరుపై కరేడు ఆనకట్ట వ్యవస్థ ఉంది. ఈ ఆనకట్ట వ్యవస్థ ద్వారా మండలంలోని కరేడు చెరువు ,చాకిచెర్లలోని గోగుల చెరువు,పెద్ద పట్టపుపాలెంలోని జమ్ములచెరువులు కు నీటి సరఫరా కావాల్సి ఉంది. ఈ ఆనకట్ట లోపల వెలుపల ఇసుక పూడిక ఉందంటూ జల వనరుల శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఇది అత్యవసర పని అంటూ ఉన్నతాధికారులు ఆనకట్ట వద్ద ఇసుక పూడికతీతకు నామినేషన్ పై కాంట్రాక్టు ఇచ్చారు. ఎవరికి కాంట్రాక్టు ఇచ్చారో పని విలువ ఎంతో తెలియదు. ఈ విషయం తెలుసుకోవడానికి జలవనల శాఖ కందుకూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హజరత్తయ్య, కందుకూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సీతారామయ్యలకు ప్రజాశక్తి పలుమార్లు ఫోన్లు చేసింది. వారు స్పందించలేదు. భీమవరం సచివాలయ సిబ్బంది కొందరు పూడికత పనుల వద్ద కనిపించారు. అయితే జలవనరుల శాఖ అధికారులు ఎవరూ ఆ వైపు వెళ్లలేదు. నిబంధనల ప్రకారం పూడిక తీత పనులు ఎంతవరకు చేయాలో జలవనుల శాఖ అధికారులు మార్కింగ్ చేయాల్సి ఉంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే పూడికతీత పనుల్లో యథేచ్ఛగా జెసిబి యంత్రాలను వినియోగిస్తున్నారు. జలవనరుల శాఖ నిబంధనల మేరకు జలవనరులలో పూడిక తీత పనుల్లో యంత్రాలను వినియోగించకూడదు. మనుషులతోనే పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉంది.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

నెల్లూరు :జిల్లాలో అన్ని రకాల సహకార సంఘాలను పటిష్ట పరచి వాటి బలోపేతానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రజలకు మంచి సేవలు అందించుటకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నాల్గవ జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా సహకారశాఖ అధికారి గుర్రప్ప పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్,పెన్నులు, బల్పాలు పంపిణీ చేశారు. మంగళవారం వైసిపి లింగసముద్రం గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు,మాలకొండ మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు జంపాలవారిపాలెంకు చెందిన మట్టే నాగేశ్వరావు మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు వేణుగోపాల్, మాల్యాద్రి, నరసింహం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపా ధ్యాయులు,నాగేశ్వరరావు మనవళ్లు గుణచరణ్,మహీధర్,ధీరజ్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు అందజేస్తున్న దశ్యం

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :నగరంలోని కోటారెడ్డి నగర్‌లోని శ్రీ చైతన్య విద్యార్థులుకు నాసా కిట్లు మంగళవారం అందజేశారు.ి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియా నాసా కో-ఆర్డినేటర్ వెంకటరమణమాట్లాడారు. అర్ఐ అనీల్, పాఠశాల ప్రిన్సిపాల్ బి సురేష్, ఎకడమిక్ కో-ఆర్డినేటర్ జి శ్రీనివాసరావు, డీన్ జి.బ్రాహ్మయ్య, సి బ్యాచ్ ఇంచార్జ్ టి శివయ్య, నాసా ప్రోగ్రాం ఇంచార్జ్ సిహెచ్ సుధీర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు :మండలంలోని మాచవరం ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆషాడే కార్యక్రమాన్ని జిల్లా లెప్రసీ ,ఎయిడ్స్ , టిబి నివారణ అధికారి డాక్టర్ ఎస్‌కె ఖాదర్ వలి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ డి జువేరియా బాను,సి హెచ్ ఓ వై. నీరజ, పి హెచ్ ఎన్ బి. వరలక్ష్మి , డి ఆర్ టి బి కోఆర్డినేటర్ ఇ.శ్రావణ్ కుమార్ , ఎస్ టి ఎస్ శ్రీమన్నారాయణ , ల్యాబ్ టెక్నీషియన్ ఎస్ కే.ఫరూక్, హెల్త్ సూపర్వైజర్లు యం. శ్రీనివాసరావు,సుశీల,సిహెచ్‌వోలు , ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-కందుకూరు : మిషన్ డైరెక్టర్ మెప్మా వారి ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీలో ఎస్ హెచ్ జి ప్రొఫైలింగ్ యాప్‌నకు సంబంధించిన వర్క్ షాప్ నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర, కమిషనర్ అనూష, ఐ బి అంకయ్య హాజరయ్యారు.మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర వివరించారు. మెప్మా సిఎంఎం సంపత్ కుమార్, సి ఓ లు మాధవి లత, సురత్న, డిఇఒ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

నారుమళ్లు పరిశీలన

కందుకూరు :పొగాకు వేలం కేంద్రం పరిదిలోని చెరువుకొమ్ము పాలెంలో పొగాకు పంట నియంత్రణ , నారు మళ్లు, యాజమాన్యం పొగ నాట్లు విడుపులు, అంతర్ సేద్యం, నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ వేలంలో నిర్వహణ అధికారి ఎం కిరణ్ మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులు పల్లి రాజశేఖర్ ఉన్నారు.

నగల కోసం వృద్ధురాలి దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు :ఓ వృద్ధురాలు ధరించిన నగలపై ఓ కిరాతకుడు కన్నేశాడు. ఏ విధంగానైనా నగలు మాయం చేయాలన్న ఆలోచనతో వృద్ధురాలితో మాటలు కలిపాడు. చివరకు ఆమెను ఇంటి వరకు తీసుకెళ్లి హత్యచేసి నగలను తీసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు నగరంలోని కుక్కల గుంట ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు కుక్కల గుంట ప్రాంతానికి చెందిన రమణమ్మ అనే వృద్ధురాలు సోమవారం కూరగాయల కోసమంటూ బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నయ్ సమీపంలోని మింజూరు రైల్వే స్టేషన్ లో మంగళవారం తెల్లవారు జామున అనుమానాస్పదంగా తిరుగుతున్న సుబ్రమణ్యం, ఆయన కుమార్తె దివ్యలను రైల్వే పోలీసులు విచారించగా అసలు వ్యవహారం బయటపడింది. ఈ సమాచారాన్ని జిల్లా పోలీసు యంత్రాంగానికి చెన్నయ్ పోలీసులు తెలియజేశారు. అప్పటికే వృద్ధురాలు కనపడటం లేదని సంతపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు హుటాహుటిన చెన్నయ్‌కి పయనమయ్యారు. చెన్నయ్ పోలీసుల అదుపులో ఉన్న సుబ్రహ్మణ్యంను జిల్లా పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం ఉదయం కూరగాయలు తీసుకుని ఇంటికి వెళుతున్న రమణమ్మతో సుబ్రమణ్యం మాట కలిపి వారి ఇంటికి తీసుకెళ్లి ఇంట్లోనే వృద్ధురాలిని హత్య చేసి ఒంటిపై ఉన్న నగలను తీసుకున్నట్లు అంగీకరించాడు. మృత దేహాన్ని ట్రావెల్ బ్యాగులో కుక్కాడు. సోమవారం సాయంత్రం సుబ్రమణ్యం ఇంటి చుట్టుపక్కల వారితో సొంత పనిపై ఊరు వెళ్తున్నట్లు నమ్మబలికి కుమార్తె దివ్యతో కలిసి ఆ ట్రావెల్ బ్యాగ్‌తో బయలుదేరాడు. రైల్వే స్టేషన్ కు చేరుకొని చెన్నయ్ రైలు ఎక్కినట్లు తెలిపారు. చెన్నై సమీపంలోని మింజూరు రైల్వే స్టేషన్ లో జనాలు ఎక్కువ మంది లేకపోవడంతో రైలు దిగేశారు. మంగళవారం తెల్లవారు జామున సూట్ కేస్ ను రైల్వే స్టేషన్ లో వదిలి తిరిగి నగరానికి చేరుకోవాలని ఆలోచన చేశారు. తండ్రి, కూతురు ప్రవర్తనపై అక్కడే ఉన్న రైల్వే పోలీసులకు అనుమానం రావడంతో విచారణ చేశారు. రైల్వే పోలీసులు వేసిన ప్రశ్నలకు తండ్రి, కూతురు ఇద్దరి నుంచి పొంతన లేని సమాధానం రావడంతో వారి వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను తెరచి చూడగా వృద్ధురాలి శవం కనిపించింది. తమ శైలిలో విచారణ చేయడంతో అసలు నిజం పోలీసులకు తెలియజేశారు. ఈ సమాచారాన్ని చెన్నయ్ పోలీసులు నెల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శనగ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-కందుకూరు :మండలంలోని ఓగూరు, వెంకటాద్రి పాలెం గ్రామాల్ల పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రాము మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా 25 శాతం రాయితీతో రైతు సేవా కేంద్రాలలో శనగలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ ఖాసిం, ఒగూరు గ్రామ వ్యవసాయ సహాయకులు కె శరత్ కుమార్, పశు వైద్య సహాయకులు షేక్ షాజహాన్, వెంకటాద్రి పాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు ఉన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ పెంచలయ్య

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అర్బన్ పిహెచ్‌సిలో వైద్యసిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి ప్రజలకు అందించాల్సిన వైద్యసేవల గురించి వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, మురుగు గుంతలను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తా చెదారం, ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ వారి బండ్లకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వసతి గృహాలకు మెడికల్ అధికారి తరచూ వెళ్లి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని, అక్కడ కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసేలా వార్డెన్‌లకు సూచించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ పిహెచ్‌సి డాక్టర్ షేక్ అస్మా, ఎంపిహెచ్ఇఒ సుధాకర్, ఎంపిహెచ్ఎస్ యు.పార్వతి, పిహెచ్‌సి కేంద్రం సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సందర్శించిన డాక్టర్ సుధాకర్ దంపతులు

నిత్య అన్నదానం సందర్శన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి చికిత్స కోసం అనేకమంది వస్తుంటారని నిత్య అన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి సహృదయంతో వారి కోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సుధాకర్ రెడ్డి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి అన్నదాన కార్యక్రమం చేపట్టడం ఎంతో గొప్ప విషయమని, ఇటువంటి కార్యక్రమం ఎంతో శ్రమతో కూడినదని, ఇటువంటి శ్రమను పేద ప్రజల సేవకే ఉపయోగిస్తున్న కంచి పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు అభినందనలు తెలియజేశారు. డాక్టర్ జి.సుధాకర్ రెడ్డి అరుణమ్మ దంపతులను ట్రస్ట్ నిర్వాహకులు పరమేశ్వర్ రెడ్డి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కె.వి.శేషారెడ్డి, జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శి మాలి వెంగయ్య, బిజెపి సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, ఎపి రైతుసంఘం నాయకులు కృష్ణ ప్రసాద్, కృష్ణమోహన్, వెంకటరామిరెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయులు సాదిక్ హుస్సేన్, బదుగు శ్రీనివాసులు, పులిమి కృష్ణారెడ్డి, అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

రెడ్‌క్రాస్‌లో ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి-కావలి

కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ మంగళవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రాన్ని పరిశీలించారు. రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ రక్తకేంద్రంలో నిర్వహించే రక్తపరీక్షలు, వివిధ ఆధునిక యంత్ర సామగ్రిని ఆర్‌డిఒకు వివరించారు. గత 8 సంవత్సరాలుగా కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం, రక్తసేకరణలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. పలు మహా నగరాలలో సైతం లేని కాంపోనెంట్ బ్లాక్‌ను తమ రక్తకేంద్రంలో పట్టణ దాతలు, జిల్లా రెడ్‌క్రాస్ సహకారంతో సమకూర్చుకున్నామని డాక్టర్ రవికుమార్ ఆర్‌డిఒకు వివరించారు. ఈ సందర్భంగా మొదటిసారి రెడ్‌క్రాస్‌కు విచ్చేసిన ఆర్‌డిఒ వంశీకృష్ణను రెడ్‌క్రాస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు రవిప్రకాష్, కలికి శ్రీహరి రెడ్డి, హరినారప రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

31 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-కావలి

ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్తంగా మంగళవారం కావలి విక్రమ సింహపురి యూనివర్శిటీ పీజీ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో 31మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ జాబ్‌మేళాలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్ ప్రయివేట్ లిమిటెడ్, మెడ్‌ప్లెస్, వీల్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, డైకిన్, బ్లూస్టార్ క్లిమేటెక్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించారు. 68 మంది సభ్యులు హాజరు కాగా 31 మంది జాబ్‌కు సెలెక్ట్ అయ్యారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం, విక్రమ సింహపురి యూనివర్శిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ సెలెక్ట్ అయినవారికి అభినందనలు తెలియజేశారు.

సభ్యత్వం నమోదులో సోమశిల ఫస్ట్

ప్రజాశక్తి-అనంతసాగరం

ఆత్మకూరు నియోజకవర్గం మండల అధ్యక్షులు, టిడిపి ముఖ్య నాయకులతో పార్టీ సభ్యత్వంపై మంగళవారం నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి క్యాంపు కార్యాలయంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని టిడిపి సభ్యత నమోదులో సోమశిల అగ్రస్థానంలో ఉన్నట్లు మంత్రి ఆనం తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం మూడో స్థానంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. సభ్యత్వ నమోదుకు 50 రోజుల సమయం ఉందని నూతన సభ్యత్వాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు మంత్రి ఆనం సూచించారు.

నాగుల చవితి వేడుకలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలో భక్తిశ్రద్ధలతో మహిళలు నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని పలు ఆలయాలు గ్రామ శివారులు కుర్రపల్లి గ్రామ సమీపంలోని కాశినాయన ఆశ్రమలో నాగుల పుట్టకు భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు ఉదయం పుట్ట చెట్టు నీరు పోసి దారం చుట్టి సలిపిండి మొలక కట్టిన సజ్జలు, నూగుల పిండి తయారు చేసి పుట్ట దగ్గర నైవేద్యంగా పెట్టి పూజలు చేసి వారి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాన వేసుకున్న పంటలను గ్రామంలోని అన్ని కుటుంబాలను ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో కాపాడాలని పూజలు నిర్వహించారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలం రేవూరు గ్రామంలోని మంగళవారం జెఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత బోయిళ్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి మొక్కలు తీర్చుకున్నారు. పుట్ట పరిసర ప్రాంతాల్లో జనార్ధన్‌రెడ్డి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మర్రిపాడు బస్టాండ్‌లో ఇక్కట్లు..

ప్రజాశక్తి-మర్రిపాడు

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై మర్రిపాడు నాలుగు రోడ్ల కూడలిలో ప్రయాణికులకు మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులతో పాటు స్థానిక మహిళా వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల్లూరు - ముంబై జాతీయ రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. మండలం చుట్టుపక్కల గ్రామాలు, మండల కేంద్రానికి అధిక సంఖ్యలో మహిళలు వస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాలు అభివృద్ధి చెందుతున్నాయి. కానీ దుకాణాలలో వస్తువులు కొనుగోలుకు వచ్చిన మహిళలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మూత్ర విసర్జన చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు రాత్రి పగలు కర్నూలు అనంతపురం గుంతకల్లు కడప జిల్లాల నుండి నెల్లూరు మద్రాస్‌కు ప్రత్యేకంగా బస్సులు

కనీస అవసరాలకు మరుగుదొడ్లు లేని మర్రిపాడు బస్టాండ్

వస్తుంటాయి. ఆ సమయంలో బస్టాండ్ కూడలిలో బస్సులు నిలిపినప్పుడు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు మూత్ర మల విసర్జన చేయాలంటే మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారాలు చేసే మహిళలు ప్రయాణికులు అధికారులకు చెప్పిన చలనం లేదు. పాలకులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల స్థాయి అధికారులు నాలుగు రోడ్ల కూడలిలో మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరిస్తే గ్రామ పంచాయతీ మరుగుదొడ్ల పరిరక్షణ పరిశుభ్రత బాధ్యత తీసుకుంటూ ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తుందన్నారు.

డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

జనావాసాల మధ్య మద్యం షాపులొద్దు..

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలో మద్యం షాపులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి రెండో మద్యం షాపును జనావాసాల మధ్య ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, మంగళవారం మహిళలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిటికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉండే మద్యం షాపులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు వందల మీటర్ల దూరంలో స్కూల్స్‌కు, హాస్పిటల్స్‌కు, ప్రార్థనా మందిరాలకు దూరంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా రెండో మద్యం షాపు కూడా ఏర్పాటు చేసే ప్రయత్నం జరుగుతుందని అధికారులు విచారించి మద్యం షాపులను ఊరికి దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, ఖాజా, ఖాజా మస్తాన్, ఇబ్రహీం, మహిళలు తదితరులున్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌బిఐ సిబ్బంది, ఇతరులు

అవినీతిని నిర్మూలించాలి

ప్రజాశక్తి-కావలి

దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోభివృద్ధికి అవినీతి ఒక ప్రధాన అవరోధమని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలోని జనతాపేటలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలోని ఆదేశాల మేరకు వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎస్ కె అజిత్ భాషా అధ్యక్షత వహించారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడానికి నియంత్రించడానికి కేంద్ర సాయిలు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సిబిఐ ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో ఎసిబి లోకాయుక్త, సిఐడి పని చేస్తున్నాయి ప్రతి పౌరుడు అవినీతిని ప్రోత్సహించకుండా బాధ్యతా యుతమైన పౌరుడుగా సమాజంలో ఎదగాలని కోరారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండు కూడా నేరమని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ అజిత్ భాషా మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న అవినీతి రహిత సమాజ నిర్మాణానికి పౌర సంస్థలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు నిరంతరం కృషి చేయడం ద్వారా ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ క్రెడిట్ ఆఫీసర్ ప్రేమ వర్మ, అడ్మిన్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, ఉద్యోగులు ఖాతాదారులు పాల్గొన్నారు.

9న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం 9న మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ నాగేంద్ర ప్రసాద్ తెలియజేశారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటిపారుదల శాఖ, పారిశుధ్యం, పంచాయతీరాజ్ శాఖ, గృహ నిర్మాణ, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ, విద్యుత్, రెవెన్యూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్ష జరుగుతుందన్నారు. కనుక ఎంపిటిసిలు, కో-అప్టడ్ మెంబర్లు గ్రామపంచాయతీ సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల అభివృద్ధి కార్యాలయం మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ డిఇఇ సిహెచ్ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలో శిథిలావస్థకు చేరుకొని దర్శనమిస్తున్న భవనాన్ని నూతనంగా మరమ్మతులు చేపట్టేందుకు కార్యాలయంలో ఉన్న విలువైన సామగ్రిని వివిధ రకాల గదులను అంచనాలను పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరాజు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కొలతలను సేకరించారు. ఈ సందర్భంగా డిఇఇ మాట్లాడుతూ కార్యాలయ మరమ్మతులు చేపట్టేందుకు కార్యాలయంలోని రికార్డుల గదులు టాయిలెట్ నిర్మాణాలు పైకప్పు పలురకాల సిబ్బంది రూములు వాటి సైడ్ వాల్స్‌లను పరిశీలించి సైడ్‌వాల్స్ నాణ్యతగా పటిష్టంగా ఉన్నాయని వాటి పైకప్పు స్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతున్నాయని వాటిని మాత్రమే రీ మోడలింగ్‌గా నూతన మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు వేశామన్నారు. అలాగే కార్యాలయం పైకప్పులో ఉన్న

పరిశీలిస్తున్న అధికారులు

విలువైన కలప పలు రకాల సామగ్రిని కూడా అంచనా వేశామని వాటి అంచనా ప్రతిపాదనలు వెంటనే జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. తొలగించిన సామగ్రిని వేలంకు సంబంధిత అధికారుల సమాచారంతో వేలం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా కార్యాలయానికి సంబంధించి అన్ని రకాల ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలోనే ఉన్నతాధికారులకు ఈ నివేదికలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని పి.బి.ఆర్. విట్స్ కాలేజీలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శేషయ్య అధ్యక్షతన జెవివి, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో 'లంగ్ కేన్సర్' వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ "కేన్సర్" అన్నది లంగ్ కేన్సర్‌గా, బ్లడ్ కేన్సర్‌గా, స్కిన్ కేన్సర్‌గా వివిధ రూపాలలో ఉంటుందని తెలియజేశారు. ప్రపంచంలో రెండో అత్యంత సాధారణ క్యాన్సర్ 'లంగ్ కేన్సర్' అని ఈ కేన్సర్ గాలి కాలుష్యం, స్మోకింగ్, సెకండ్ హ్యాండ్ స్మోక్ (ధూమపానం అలవాటు లేకపోయినా ఆ అలవాటు ఉన్నవాళ్లు వదిలే పొగ పీల్చడం వల్ల), కుటుంబ చరిత్ర, తీవ్ర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్స్, ప్రమాదకర వృత్తుల వల్ల ఈ వ్యాధులు కలుగుతాయని తెలియజేశారు. అదేవిధంగా డాక్టర్ మాట్లాడుతూ ధూమపానం మానుకోవడం, ఇంట్లో లేదా.. పని ప్రదేశాల్లో పొగరహిత వాతావరణం ఏర్పాటు చేసుకోవడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, వాయు కాలుష్య

కేన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నుంచి దూరంగా ఉండడం, రెగ్యులర్ హెల్త్ చెకప్ చేయించడం ద్వారా లంగ్ కేన్సర్ నివారించవచ్చని తెలియజేశారు. విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.సుబ్బయ్య, ముఖ్యఅతిథి డాక్టర్ టి.లక్ష్మీ, చీఫ్ మెడికల్ ఆఫీసర్, జి.కన్యాకుమారి, పేషంట్ కౌన్సిలర్, పి.పద్మజ, జెవివి పట్టణ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి. హరినాథ్, జె.వి.వి. ఉపాధ్యక్షులు కె.హరినారపరెడ్డి, జె.వి.వి. సంయుక్త కార్యదర్శి సి.కల్లయ్య, మండవ వెంకట.రమణయ్య, గాదిరెడ్డి.సభ్యులు అమెరిశెట్టి. హాజరత్తయ్య, శ్రీకీర్తి, ప్రొఫెసర్స్, లెక్చరర్స్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు జన్మదిన శుభ సందర్భంగా విద్యార్థులకు శుభ్ దిన్ భోజన్ ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దళితవాడ అంగన్‌వాడీ పాఠశాలల విద్యార్థులకు అరటి పండ్లు, స్వీట్స్‌లతో విద్యార్థులకు ఆయన శుభ్ దిన్ భోజన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్ పాఠశాల సిబ్బంది విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలిపి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా ఆయనను సన్మానించారు. ముందుగా కార్యాలయ సిబ్బంది కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

చెరువు వేలం

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని ఆమెనిచిరువెల్ల గ్రామంలో మంగళవారం సర్పంచ్ లక్ష్మమ్మ అధ్యక్షతన చెరువు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు వేలంకు నలుగురు రూ.10వేలు డిపాజిట్ కట్టి హాజరయ్యారు. ఈ చెరువును ఖాదర్ సాహెబ్రూ రూ.4 లక్షల 15 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి తిరుపతయ్య, కార్యదర్శి రమణారావు, ఉప సర్పంచ్ రాధా, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒకు అభినందనలు

ప్రజాశక్తి-అనంతసాగరం

ఎంఇఒ-1 విధులు నిర్వహిస్తున్న ఎంవి జానకిరామ్ కందుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ డిప్యూటీ డిఇఒగా నియమితులైనందుకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 ప్రభాకర్ రెడ్డి, ఎపి వైఎస్ఆర్‌టిఎ కార్యదర్శి మెటుకూరు సుబ్బారెడ్డి, జిల్లా వైఎస్ఆర్ టిఎ ఉపాధ్యక్షులు సత్యాల డానియేల్, మండల వైఎస్ఆర్‌టిఎ అధ్యక్షురాలు శ్రీలత, యుటిఎఫ్ మండల అధ్యక్షులు వడ్డిబోయిన వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు పోలంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పలు యూనియన్‌ల నాయకులు అభినందించారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ సందర్శన

ప్రజాశక్తి-సంగం

సంగంలోని పిహెచ్‌సి వైద్యశాలలో మంగళవారం డిఎంహెచ్ఒ పెంచలయ్య సందర్శించారు. ఈ మేరకు వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో విషజ్వరాల నివారణపై సిబ్బందిని అప్రమత్తం చేసి నివారణా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండి, నివాసాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగేలా అవగాహన కల్పించాలన్నారు.

తలసేమియా ఆస్పత్రి ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు, తలసేమియా బాధిత బాలలకు ఒక వరం అని ఆర్‌డిఒ వంశీకృష్ణ పేర్కొన్నారు. కావలి రెడ్‌క్రాస్ ఆవరణలో త్వరలో ప్రారంభించనున్న తలసేమియా ఆసుపత్రి నిర్వహణ కొరకు పట్టణ ప్రముఖులు విరాళాలు అందజేయగా, కావలి ఆర్‌డిఒ, రెడ్‌క్రాస్ అధ్యక్షులు వంశీకృష్ణ రెడ్‌క్రాస్ భవనంలో ఆ విరాళాలు స్వీకరించారు. విశ్రాంత బ్యాంక్ అధికారి, రెడ్‌క్రాస్ యోగ కేంద్రం కన్వీనర్ కె.హరినారప రెడ్డి ఒక లక్ష తొమ్మిది వేల రూపాయలు, ప్రముఖ బిల్డర్ దేవరపల్లి మధుసూదన్ రెడ్డి ఒక లక్ష నూట పదహారు రూపాయల చెక్కులను ఆర్‌డిఒ వంశీకృష్ణకు అందజేయగా, ఆర్‌డిఒ వారిని అభినందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెద్ద నగరాలలో మాత్రమే సాధ్యమయ్యే తలసేమియా వైద్యసేవలు కావలి లాంటి చిన్న పట్టణంలో దాతల సహాయంతో ఏర్పాటు చేయడం ఈ ప్రాంత తలసేమియా బాధిత బాలలకు ఒక వరమని పేర్కొన్నారు. మరో పది రోజుల్లో తలసేమియా డే కేర్ సెంటర్

దాత హరినారపరెడ్డిని సన్మానిస్తున్న ఆర్‌డిఒ

ప్రారంభిస్తామని తెలిపారు. తలసేమియా ఆసుపత్రి నిర్వహణకు దాతలు ముందుకు వచ్చి రెడ్‌క్రాస్‌కు సహకరించాలని ఆర్‌డిఒ కోరారు. రెడ్ క్రాస్ రక్తకేంద్ర ఆధునీకరణ, తలసేమియా ఆసుపత్రి నిర్మాణం కోసం విశేష కృషి చేసి విరాళాలు సేకరించిన కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డిని ఆర్‌డిఒ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్ డి.రవిప్రకాష్, ప్రముఖ రొటేరియన్ వెంకట సుబ్బయ్య, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'పొట్లూరు'కు జీవితకాల సభ్యత్వం

ప్రజాశక్తి-కావలి : టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు మంగళవారం కావలి టిడిపి కార్యాలయంలో రూ.లక్ష చెల్లించి జీవితకాల సభ్యత్వాన్ని పొందారు. కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా పొట్లూరి శ్రీనివాస్ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఎంఎల్ఎ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

అర్చకులకు రూ.15వేలు పెంపు : ఆనం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్రంలో రూ.50 వేలు పైబడిన ఆదాయం ఉన్న ఆలయాల్లో అర్చకులకు చెల్లించే కనీస వేతనం రూ.15వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ పెంపువల్ల లబ్ధిపొందే అర్చకులు 1683 మంది ఉంటారన్నారు. కనీస వేతనం నెలకు రూ.15వేల కంటే తక్కువ పొందుతున్న అర్చకులకు కొత్త వేతనం కింద రూ.15వేలు చెల్లిస్తే దేవదాయ శాఖకు రూ.10కోట్ల వరకు అదనపు వ్యయం అవుతుందన్నారు. ఇందులో కొంత భాగాన్ని సి.జి.ఎఫ్. నుంచి చెల్లిస్తారని, మొత్తం లబ్ధిపొందే అర్చకుల సంఖ్య 3203 అని మంత్రి తెలిపారు. దేవదాయశాఖ 1987 (30 సెక్షన్)లోని 70వ సెక్షన్‌ను అనుసరించి అర్చకులకు చెల్లించే కనీస వేతనాన్ని దేవదాయశాఖ భరిస్తుందన్నారు. ఎన్నికల ప్రణాళికలో బ్రాహ్మణులకు, ఇతర వర్గాలకు, అర్చకులకు, వేద పండితులకు, వేదాధ్యయన విద్యార్థులకు ఇచ్చిన నిరుద్యోగ భృతితో సహా ఎన్నికల ప్రణాళికలోని అన్ని అంశాలను అమలు చేసిన ఏకైక శాఖ దేవదాయశాఖ మాత్రమేనని దేవదాయశాఖ మంత్రి స్పష్టం చేశారు. దేవాలయాలకు సంబంధించి, అర్చకులకు సంబంధించి ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను తమ శాఖ అమలు చేయడంలో ముఖ్యమంత్రి సహకారం మరువలేనిదని తెలియజేశారు.

పంటల సాగుపై అవగాహన

మాట్లాడుతున్న ఎడిఎ దేవసేనమ్మ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని కరటంపాడు, బోయిళ్లచిరివెళ్ల గ్రామాలలో సంబంధిత రైతు సేవా కేంద్రాలలో సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆత్మకూరు ఎడిఎ దేవసేనమ్మ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను రైతులకు వివరించారు. ప్రభుత్వం పొగాకు పంటలకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, ఇతర పంటలను ప్రోత్సహిస్తుందని, విత్తనాలను రైతులకు సబ్సిడీలో అందజేస్తుందని తెలియ జేశారు. శెనగ నూతన వంగడాలు యాజ మాన్య పద్ధతులు, దిగుబడి ధర మొదలకు సాగు మెలకువలను గురించి శిక్షణ ఇచ్చారు. రైతులు శెనగ విత్తనాలను సబ్సిడీలో ఇప్పించా ల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.కిషోర్ బాబు, విఎఎలు ఎస్‌కె.ఎస్థాని, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని రామాపురం, వరికుంటపాడు గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పంటలను సందర్శించి రైతులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు రబీ సీజనులో సాగు చేస్తున్న శనగ, మినుము, పెసర, వేరుశెనగ పంటల బీమాను డిసెంబర్ 15 తేదీలోపు చేసుకోవాలన్నారు. అలాగే వరిపంట సాగు చేసే రైతులు డిసెంబర్ 31వ తేదీ లోపు మీసేవ కేంద్రం లేదా బ్యాంకుల వద్ద ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒక హెక్టారు శనగ పంటకు రూ.140, మినుము



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రవికుమార్

పంటకు రూ.95, పెసర పంటకు రూ.90, వేరుశనగ పంటకు రూ.150, వరి పంటకు రూ.420 చొప్పున ప్రీమియం ధర చెల్లించి రైతులు స్వచ్ఛందంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కోసం పంటల బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ విధంగా ప్రీమియం చెల్లించిన రైతులకు పంటల దిగుబడిలో ఏమైనా నష్టం వాటిల్లితే ఒక హెక్టారుకు శనగకు రూ.70వేలు, మినుముకు రూ.47,500, పెసరకు రూ.45వేలు, వేరుశనగకు రూ.75వేలు, వరికి రూ.1,05,000 బీమా చొప్పున నగదు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక సహాయకులు సుబ్బారాయుడు, కిషోర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

BEFORE THE III JUDGE COURT OF SMALL CAUSES, CHENNAI

MCOP.No. 2705 of 2024

Govintharaj,
... Petitioner
-Vs-
1)M.Ranjith Kumar,
2)The New India Assurance Company Limited,
3) Moddu Subrahmanyam,
4) United India Insurance Company Limited,
... Respondents

To
Moddu Subrahmanyam,
S/o. Venkaiah,
NTR Colony, Peddapadugupadu,
Kovur, SPSR, Nellore District–524 137.

Take notice the Petitioners, herein filed Petition for compensation and the matter is posted on 06-01-2025 for your Appearance before the Hon'ble III Judge, Court of Small Causes, Chennai at about 10.30 a.m. kindly enter your Appearance otherwise the matter will be heard in your absence.

M/s M.Malar,
F.Terry Chella Raja,
R.Srinivasan,
Counsel for Petitioner

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విత్తనాల కొరతను అధిగమించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత అధికారులు ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్లో వ్యవసాయ అనుబంధ రంగాలలో అమలవు తున్న కార్యక్రమాలు, లక్ష సాధన పై కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు .పంటల విస్తీర్ణాన్ని దష్టిలో పెట్టుకుని అవసరం మేరకు ఎరువులు సిద్ధంగా ఉంచుకోవా లన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తూ ఎరువుల కొరత రాకుండా చూడాల న్నారు.రైతులకు ఉపయో గపడే విధంగా పొలంబడి కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించా లన్నారు. సిసిఆర్సి కార్డులు, భూసార పరీక్ష కార్డులు నూరు శాతం రైతులు అందించా లన్నారు. ఏపీఎంఐపీ పథకం కింద మంజూరైన మైక్రో ఇరిగేషన్ పరికరాల కు సంబంధించి రైతుల వాటాను చెల్లించే విధంగా వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ ఏడాది సాగు చేపడుతున్న ఉద్యాన పంటలైన ఆయిల్ ఫామ్, నిమ్మ తదితర పంటలకు డ్రిప్ ఇరిగేషన్ అనుసంధానం చేయాలన్నారు పశువుల షెడ్ల నిర్మాణ పనులు, పశుగణన వేగవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ జెడి కి సూచించారు. బ్యాంకర్లు, అధికారులు మత్స్యకార గ్రూపులతో సమావేశాలు నిర్వహించి మేకనైజ్డ్ బోట్లు పొందే విధంగా చైతన్యం తీసుకోవా లన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో వివిధ రకాల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ముందుగానే పంటల్లో వచ్చే తెగుళ్లను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో అమలవుతున్న పథకాల లక్ష్యసాధనకు కషి చేయాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్య వాణి, పశు సంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు ,మార్కెటింగ్ ఏడి అనిత ,ఆత్మా పీడీ, హార్టికల్చర్ , పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

అడ్డుగోడ తొలగించాలని వినతి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలంలోని ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ దర్గాకు దగ్గరలో ఈశాన్య దిక్కులో ప్రకృద్దీన్ బాబా, వస్తాద్ బాబా, సర్దార్ బాబా, పురాతన దర్గాలు ఉన్నాయి. ఈ ప్రదేశానికి వెళ్లుటకు ఉత్తర దిక్కులో చిన్న దారి ఉండేది. గత ఐదేళ్ల క్రితం చిన్న అడ్డుగోడ నిర్మించి, ఆ దారిని లేకుండా చేయడం జరిగింది. దర్గాకు వచ్చే వేలాది భక్తులు ఆ దారిని ఎంచుకొని, ఆ చిన్నదర్గాలను దర్శించేవారు. ఇప్పుడు ఆ దారి లేకపోవడం వల్ల అక్కడ ఉండే దర్గాలు మరుగున పడే అవకాశం ఉంది. ఎవరైనా ముస్లిములు చనిపోయినప్పుడు ఆ దారినే తీసుకొని వెళ్లేవారు. ఆ దారిలో కట్టిన అడ్డుగోడను తొలగించి, యథావిధిగా రాకపోకలు కొనసాగించాలి.సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ ఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ అస్లాం, సిఐటియు మండల కార్యదర్శి గయాజ్, మైనారిటీ నాయకులు, షకీల్ అహ్మద్, పార్టీ నాయకులు సత్తార్, షేక్ ఖలీల్, ఆవాజ్ నాయకులు సయ్యద్ గౌస్ బాషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎండిఎం కార్మికులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన రాష్ట్రస్థాయి వంటల కాంపిటీషన్లో మండలం లోని ఎండిఎం కార్మికులు పాల్గొన్నారు. విజయవాడలో ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం భోజన కార్మికుల రాష్ట్ర స్థాయి వర్క్ షాపు జరిగిన విషయం తెలిసిందే. ఈ వర్క్ షాపులో మండల కార్యదర్శి పి.శీనమ్మ, మమత, మంజుల, మర్రిపాడు మండలం బి.రాములమ్మ, బుచ్చి మండలం సునీత, నిర్మలమ్మలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదే శ్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చిన సంగతి తెలిసిందే. వైసిపి హయాంలో ఉన్న జగనన్న గోరుముద్ద పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంగా మార్చారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూను టీడీపీ ప్రభుత్వం

పోటీలకు ఎంపికైన కార్మికులు

మార్చింది. ఈమెనూలో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారు.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథ కానికి సంబంధించిన మెనూ పూర్తి వివరాలు ఇలా ఉ న్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మేరకు సోమ వారం: కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, వేరుశనన బెల్లం చిక్కి మంగళవారం: పులిహోర, దొండకాయ పచ్చ డి, ఉడికించిన కోడిగుడ్డు, రాగి జావ బుధవారం:కూరగా యల అన్నం, ఆలూ కుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, వేరు శనగ బెల్లం చిక్కీ గురువారం: సాంబార్ బాత్/లెమన్ రై స్, టమోట పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు శుక్రవారం:అ న్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కీ శనివారం: ఆకుకూర అన్న, పప్పుచారు,రాగి జావ, స్వీట్ పొంగల్ ఇవ్వనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వంటల పోటీలకు మండలంలో ని భోజన కార్మికులు పాల్గొని వంటల్లో తమ ప్రతిభను చూపించారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలు ఏమైనా సమస్యలు తలెత్తుంటే వాటిని పరిష్కరించుకునేందుకు ప్రస్తుత గ్రామ సభలను సద్వినియోగం చేసుకో వాలని తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని రేబాల గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించడం జరుగు తుందన్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వేలో తప్పులను సరి చేసేందుకే గ్రామ సభలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. రీసర్వేల్లో ప్రధానంగా ఐదు సమస్యలపై దృష్టి సారించామని చెప్పారు. విస్తీర్ణంలో

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యత్యాసం, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ విభజన, కోరిలేషన్ సవరణ, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్ విభనజ వంటి సమస్యలపై తప్పిదం జరిగి ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించి 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే మండలంలో నాలుగు చోట్ల గ్రామ సభలు నిర్వహించా మని మిగిలిన గ్రామాలలో 14వ తేదీ లోపు గ్రామసభలు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివా సులు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రఘు రామరాజు, టిడిపి నాయ కులు మస్తానయ్య, రైతులు, రెవెన్యూ, అధి కారులు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంపై ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలో సోలార్ సూర్య ఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకం పై విస్తత ప్రచారం కార్యక్రమం నిర్వహిం చారు. మంగళవారం ఏకే నగర్ సబ్ డివిజన్,రామ్మూర్తి నగర్ సబ్ డివిజన్ రాజేంద్రనగర్ సబ్ డివిజన్లో నెల్లూరు టౌన్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్, సునీల్, కిరణ్ వారి పరిధిలోని అసిస్టెంట్ ఇంజనీర్లు స్టాఫ్ ను కలుపుకొని సచివాలయాల్లో, స్కూల్స్ లలో సోలార్ వినియోగంపై విస్తత ప్రచారం కల్పించారు. సోలార్ వినియోగించినందువల్ల కలిగే లాభాలు గురించి వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఇలానే టౌన్ మొత్తం అన్ని సచివాలయాల్లో స్కూల్స్ లలో ఈ అవగాహన సదస్సులు కొనసాగిస్తామని డిప్యూటీ ఇంజినీర్లు తెలపడం జరిగింది. 200 యూనిట్లు వాడేవారికి ఇది చాలా మంచి అవకాశం అని మరియు ఈ పథకం ద్వారా సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లక్ష్మి బాయ్, విజయ్,సుధాకర్, దామోదర్, లక్ష్మీనారాయణ, నసురుల్లా, మునిశేఖర్, గోపాలకృష్ణ, రమణ, కృష్ణవేణి,విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణపై సమాచారం సరికాదు

-కార్యదర్శిపై గ్రామస్తుల ఆగ్రహం..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పంచాయతీ దొరువు ఆక్రమణపై ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చిన పంచాయతీ కార్యదర్శి వైనమిది. వివరాల్లోకి వెళితే..మండలంలోని కోడూరు బిట్ -1 రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం 1105లో 2 ఎకరాల 20 సెంట్ల పంచాయతీ దొరువు ఆక్రమణకు గురైంది. వెబ్ లాండ్ అడంగల్, డైగ్లాట్ ల లో పోరంబోకు దొరువుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్న ఈ దొరువులో నీటిని కొత్త కోడూరు గ్రామాని కి చెందిన గ్రామస్తులు ఖర్మ కాండలకు, రజకులు బట్టలు ఉతికేందుకు, వేస వికాలంలో పశువులు తాగేం దుకు వాడుకునే వారు. ఈ దొరువును అదే ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు దర్జాగా ఆక్రమించ డ మే కాకుండా చదును చేసి వ్యవసాయ సాగుబడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణ చెరనుంచి పంచాయతీ దొరువును విడిపించాలని సంబంధిత శాఖల అ ధికారులకు పలుమార్లు విజ్ఞప్తిచేశారు. అయినప్పటికీ అధికారులు స్పందించ లేదు. ఈ నేపథ్యంలో దొరువు ఆ క్రమణ పర్వం గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఈ నెల 4వ తేదీన ఆక్రమణ నుంచి దొరువును విడిపించి, అందులో హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అంతవరకూ బాగానే ఉంది. ఈ దొరువు ఆక్రమణకు గురి కాలేదంటూ ఆక్రమణ నుంచి విడిపించిన సాక్షాత్తు పంచాయతీ కార్యదర్శే ఉన్నతాధి కారులకు లిఖిత పూర్వకంగా తప్పుడు సమాచారం ఇవ్వడం గమనార్హం. దొరువు ఆక్రమణపై అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చిన కార్యదర్శిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. అంతేకాకుండా కార్యదర్శి తప్పుడు సమాచార వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థులందరికీ ఆపార్ ఐడి కార్డులు

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలోని ప్రభుత్, ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులందరికీ అపార్ ఐడి కార్డుల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఒ. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్లు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు అపార్ ఐడి కార్డులు మంజూరు, ఉపాధిహామీ పనిదినాల పెంపు, పాఠశాలల్లో మనబడి మన భవిష్యత్తు అభివృద్ధి పనుల పూర్తి మొదలైన అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీఓలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు లోని వివరాలకు, స్కూలు రికార్డు లోని వివరాలకు సరిపోయిన విద్యార్థిని విద్యార్థులకు వెంటనే అపారు ఐడి కార్డు మంజూరు చేయాలన్నారు. ఒకవేళ ఆధార్ కార్డు లో సరిగా ఉండి, స్కూల్ రికార్డుల్లో తేడా ఉన్నట్లయితే సంబంధిత రికార్డులను సరిచేసి, నిర్ణిత ఫారంలో పూర్తిచేసి అపారు ఐడి కార్డు మంజూరు చేయాలన్నారు. ఈ రెండు కేటగిరీల విద్యార్థిని విద్యార్థులకు వారం రోజుల్లోపు సంబంధిత ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఈ నెల 14 న మెగా తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు రాష్ట్రమంతటా ఒకే రోజున ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ టీం సభ్యులు జిల్లా మొత్తంలో వచ్చిన అర్జీలను పరిష్కరించిన విధానంను పరిశీలిస్తారని, సరైన కారణం లేకుండా తిరస్కరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, డిఆర్ఒ ఉదయభాస్కర్ , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి , జెడ్‌పి సీఈఓ మోహన్ రావు, హౌసింగ్, డ్వామా పీడీ లు వేణుగోపాల్ , గంగా భవాని, డీఈఓ బాలాజీ రావు, సర్వ శిక్ష ఏపీఓ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పని సరి

ప్రజాశక్తి-కొడవలూరు: రైతులు భూసార పరీక్షలు ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించు కోవాలని కోవూరు ఏడిఏ సుజాత చెప్పారు. ఆమె మంగళవారం కొడవలూరు మండలం, గౌతమ్ నగర్, గండవరం పంచాయతీ లలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వరిలో అనుకూలమైన రకాలు, వాటి కాలపరిమితి గురించి రైతులకు వివరించారు. గండవరంలోని నారు మడులను తెగుళ్లు, పురుగుల బారిన పడకుండా పైరును కాపాడు కోవచ్చని తెలియజేశారు. కార్యక్ర మంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సిహెచ్.ఎస్.లక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారి పి.వెంకట్రావు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-కొడవలూరు:మండలంలోని రామన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల గ్రోత్ ను బరువును ఎత్తులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రతినెలా 10వ తేదీ లోపు పిల్లల బరువు కీర్తన చూసి తప్పు లేకుండా ఆన్లైన్లో ఎంటర్ చేయాలనే సూచిం చారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంభి ంచడం వల్ల అధిక దిగుబడులు సాధిం చొచ్చని డిఆర్‌సి వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) సి. మారుతీ దేవి పేర్కొ న్నారు. మండలంలోని పాపిరెడ్డిపాలెం, చిన్నచెరు కూరు గ్రామాల్లో మంగళవా రం మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ, పొలం పిలు స్తోంది కార్యక్రమాలు జరిగాయి. మండల వ్యవసాయ శాఖ అధికారి వివి శిరీష రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మారుతీ దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులను వి వరించారు.జీఏపి సర్టిఫికేషన్ గు రించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ స హాయక సంచాలకులు ఏ రాజ్ కుమార్ నారుమడి యా జమా న్యం గురించి రైతులకు వివరించారు.